క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

మునిపల్లి(అందోల్): మండల కేంద్రం మునిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ ఆశాజ్యోతి మంగళవారం తెలిపారు. మండలంలో పట్టభద్రుల ఓట్లు 503 ఉండగా ఉపాధ్యాయుల ఓట్లు 14 ఉన్నట్లు చెప్పారు. బుధవారం జరిగే ఎన్నికల సందర్భంగా పోలీస్ బందోబస్తు చేస్తున్నట్లు వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ఐదుగురికి రూ. వెయ్యి, నలుగురికి రూ.1,500, మరో ఇద్దరికి రూ. 2 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

42 మందికి..

కల్హేర్(నారాయణఖేడ్): డ్రంకెన్ డ్రైవ్ కేసులో 42 మందికి రూ. 50 వేలు జరిమానా విధిస్తూ నారాయణఖేడ్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ శ్రీధర్ మంథని తీర్పు వెలువరించారని సిర్గాపూర్ ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిర్గాపూర్ మండలంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 42 మందికి కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



ప్యాడ్‌లను అందజేసిన యాజమాన్యం

మునిపల్లి(అందోల్): వోక్స్ వ్యాగన్ స్కూల్ యాజమాన్యం మంగళవారం మండలంలోని పెద్దగోపులారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 35 మంది 9, 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో వోక్స్ వ్యాగన్ స్కూల్ యాజమాన్యం సిబ్బంది డాక్టర్ రాజు చికోటి, నవీన్ కోలోజు, సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో వేగం పెంచాలి



మొక్కలకు నీరు పడుతున్న ఎంపీడీఓ

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకంలో భాగంగా వననర్సరీల్లో మొక్కల పెంపకం వేగవంతం చేయాలని ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. మండలంలోని భీంరా గ్రామంలో ఆయన మంగళవారం వననర్సరీని పరిశీలించారు. మండలంలోని అన్నీ నర్సరీల్లో కేటాయించిన సంఖ్యలో మొక్కలు పెంపకం చేపట్టాలన్నారు. మొక్కలకు నీరు పట్టడంపై వన సేవక్‌కు అవగాహన కల్పిస్తూ మొలకెత్తని ప్యాకెట్లు వేరు చేసి మళ్లీ విత్తనాలు వేయాలని సూచించారు. టేకు మొక్కలతో పాటు పలు పండ్ల మొక్కలు పెంచాలని సూచించారు.

కాంగ్రెస్ పాలనలో సమన్యాయం

టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి



ప్రచారంలో నిర్మలారెడ్డి, నాయకులు

సదాశివపేట (సంగారెడ్డి): కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో చివరి రోజు పట్టణంలోని ప్రైవేట్ కాలేజీ లెక్చరర్లను కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. భవిత, ప్రగతి, ఉజ్వల కళాశాలలోని లెక్చరర్లను ఓటు చేయాలని ఆమె విన్నవించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, సిద్ధన్న, పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పుల్‌కల్(అందోల్): 108 పుల్‌కల్ అంబులెన్స్ ఉద్యోగి ఈఎంటీ నవీన్ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు తోటి ఉద్యోగులు రూ.50,100 ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం సంగారెడ్డి, వికారాబాద్, కరీంనగర్, నిజాంబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 108 సిబ్బంది నవీన్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పైలెట్ జగన్, కృష్ణారెడ్డి, దేవ గౌడ్, సాయి, అనిల్, గోపాల్, విజయ్‌కుమార్, 102 పైలెట్ తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు శివరాత్రి శోభ

శివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాలు కేతకీ, కాశీ విశ్వేశ్వర దేవాలయం, ఎల్లంపల్లి ఆలయం, కాశీనాథ్, భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. బుధవారం తెల్లవారు జామున నుంచే మహాశివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.. వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగు నీరు, క్యూలైన్లు, పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– సాక్షి, నెట్‌వర్క్



కల్హేర్: భద్రప్ప స్వామి మందిరం



సంగారెడ్డి టౌన్ : కాకతీయుల కాలం నాటి శివాలయం



నారాయణఖేడ్: కాశీనాథ్ ఆలయం

భక్తిశ్రద్ధలతో శేషవాహన సేవ ఊరేగింపు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో శేషవాహన సేవ ఊరేగింపు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటకలోని పురంత స్వాముల నృత్యాలు, దండకాలు, శివనామస్మరణ మధ్య ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శివరుద్రప్ప, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు హన్మంత్ రావు పాటిల్, రుద్రప్ప పాటిల్, నాయకులు ఉదయ్‌శంకర్ పాటిల్, చంద్రశేఖర్, మల్లయ్య స్వామి, నర్సింలు పాల్గొన్నారు.



పురంతస్వామి దండకం

టై అండ్ డై-ప్రింటింగ్‌పై శిక్షణ

జహీరాబాద్: డీడీఎస్-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సహజ సిద్ధమైన రంగులతో టై అండ్ డై , చీరలపై వేసే ప్రింటింగ్‌పై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ విజ్ఞాన శాస్త్రవేత్త హేమలత సహజసిద్ధ రంగుల ఉపయోగాలు, ఏఏ మూలాల నుంచి సహజ రంగులను ఉత్పత్తి చేయవచ్చనే విషయాలపై వివరించారు. సహజసిద్ధ రంగులపై పనిచేసే నిపుణులు శ్రీరామమూర్తి పాల్గొని అభ్యర్థులకు తయారీ పద్ధతులు, చిట్కాల గురించి తెలియజేశారు. శిక్షణలో భాగంగా నీలగిరి బెరడు, మోదుగపువ్వు, రత్నజ్యోతి, ఖాసు, తంగెడుపువ్వు, అల్జిరిన్, కసింబ్లాక్, ఉల్లి గడ్డపొట్టు వంటి వాటితో రంగులు తీసి చీరలకు రంగు వేయడం, ప్రింటింగ్ చేయడం నేర్పించారు. లహరియ, ఎవ్రాన్, ప్లీటింగ్, బండ్లింగ్, క్లమింగ్, బాంధని వంటి రకాల టై అండ్ డై పద్ధతుల గురించి నేర్పించారు. శిక్షణ అనంతరం డై, ప్రింటింగ్ చేసిన బట్టలను ప్రదర్శించారు. అనంతరం శిక్షణకు వచ్చిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ వరప్రసాద్, శాస్త్రవేత్తలు స్నేహలత, శైలజ, కై లాష్, స్వామి, ఆయా గ్రామాల మహిళలు పాల్గొన్నారు.



రంగులు అద్దడంపై శిక్షణ ఇస్తున్న గృహ విజ్ఞాన శాస్త్రవేత

సబ్‌ప్లాన్ అమలు చేయండి

నారాయణఖేడ్: దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. మంగళవారం వివిధ సామాజిక సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయింపు జరగలేదన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి గతం కంటే కేటాయింపులు తగ్గాయని వివరించారు. కార్యక్రమంలో సామాజిక సంఘాల నాయకులు కాన్షీరాం, సంతోష్, నర్సింహులు, భీంసేన, అరుణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అతిమెల మాణిక్

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

నారాయణఖేడ్: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఖేడ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధులను ముందుగానే నిర్ధారిస్తే చికిత్సలు సులభమవుతాయన్నారు. శిబిరానికి హాజరైన వారికి వైద్యులు, సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్‌అలీ, కౌన్సిలర్ హన్మాండ్లు, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, అవుటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మహాశివరాత్రి పోస్టర్ ఆవిష్కరణ

పటాన్‌చెరు: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని డివిజన్ పరిధిలోని చైతన్యనగర్‌లో ఉన్న మహాదేవుని ఆలయంలో నిర్వహించే వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన శివాలయాల్లో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో శివరాత్రి పర్వదినాన్ని నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు వెంకటేష్, ఆలయ అర్చకులు ఓంకార్, కమిటీ సభ్యులు, శివస్వాములు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

మహిళలకు సర్టిఫికెట్ల అందజేత

సంగారెడ్డి: సిమెంట్ ఇటుకల తయారీపై స్వయం సహాయ సంఘాల మహిళల శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వాడనున్న ఇటుకల తయారీపై మహిళలకు గతవారం రోజుల నుంచి శిక్షణ ఇస్తున్నారు. నేషనల్ కన్స్‌స్ట్రక్షన్ అకాడమీ (న్యాక్) ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగింది. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ జంగారెడ్డి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో న్యాక్ ఏడీ రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఉపాధిహామీ కూలి పెంచాలి

నారాయణఖేడ్: ఉపాధిహామీ పథకంలో పనిచేసే వారికి కూలీ రోజుకు రూ.500 పెంచాలని ఎంసీపీఐయూ డివిజన్ నాయకులు తెంకటి కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నమ్లిమెట్ గ్రామంలో కూలీలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం ద్వారా ఏడాదికి 100 రోజులు పని కల్పిస్తున్నందున మేలు జరుగుతోందన్నారు. కాని ఎంత పనిచేసినా రోజుకు రూ.100 నుంచి రూ.150 వరకే కూలీ వస్తుండటంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా మారిందన్నారు.

దొంగలు హల్‌చల్

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని అరూర్ గ్రామంలో దొంగలు హల్‌చల్ చేశారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనానికి పాల్పడ్డారు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. 7 తులాల బంగారం, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్ గౌడ్ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

సంగారెడ్డి క్రైమ్: విద్యార్థి అదృశ్యమైన సంఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పట్టణ సీఐ రమేష్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన విద్యార్థి(20), మంగళవారం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

సదాశివపేట(సంగారెడ్డి): పైపులైన్ లీకేజీ వల్ల తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పురపాలక సంఘం కమిషనర్ ఉమ మంగళవారం ఒక ప్రకటనతో పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు 25 నుంచి వచ్చే నెల 4 వరకు తాగునీటి సరఫరా పైపులైన్‌లో పచ్చ రంగు నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. పట్టణంలో పైపులైన్ మరమ్మతుల పనులు జరుగుతున్నాయి. సదాశిపేట పట్టణ ప్రజలు సరఫరా అయ్యే నీటిని తాగటానికి కాకుండా ఇతరత్రా అవసరాలకు మాత్రమే వినియోగించగలరని తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

జిన్నారం (పటాన్‌చెరు): ప్రమాదవశాత్తు షాట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన గడ్డపోతారం మున్సిపాలిటీలోని చెట్లపోతారం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన ఓం గుప్తా కుటుంబం స్థానికంగా అద్దెకుంటుంది. మంగళవారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా ఇంట్లో మంటలు చెలరేగడంతో బయటకు పరుగుతీశారు. దుస్తులు, నిత్యావసరాలు, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. పేద కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు అధికారులను కోరారు.

వివాహిత అదృశ్యం



యామిని (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: వివాహిత అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన లక్ష్మణ్ రాజు ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇతని భార్య యామిని గత సంవత్సరం నుంచి మానసికస్థితి సరిగ్గా లేక బాధపడుతుంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం లక్ష్మణ్‌రాజు డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చే సరికి భార్య కనిపించలేదు. తెలిసిన వారి వద్ద , స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఎస్‌సీ అంతర్గత మార్కుల పరిశీలన

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఎస్టీ బాలికల గురుకులంలో ఎస్ఎస్‌సీ విద్యార్థుల అంతర్గత మార్కులు మంగళవారం పరిశీలించారు. ఎంఈఓ నాగరం శ్రీనివాస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజ, తనిఖీ బృందం సభ్యులు లక్ష్మణ్, నాగభూషణం, మధుకర్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. మంగళవారం సర్పాపూర్‌లో సమావేశంలో మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఏడాదిలో 56 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశారని కొనియాడారు. నిరుద్యోగుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గ్రాడ్యుయేట్లు అండగా నిలవాలని కోరారు. ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల సమావేశంలో పాల్గొన్న నీలం మధు

ప్రభుత్వ ఆస్పత్రిలో నాసిరకం భోజనం

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణీలకు సరైన వైద్యం, రోగులకు నాణ్యమైన భోజనం అందడం లేదని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ ఆరోపించారు. మంగళవారం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి, ప్రసూతి వార్డులోని బాలింతలతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఐనోల్ గ్రామానికి చెందిన బాలరాజు కూతురు 16 రోజుల క్రితం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ కోసం చేరింది. డెలివరీ అయి 16 రోజులైనా డిశ్చార్జ్ చేయడం లేదని, సిజేరియన్ చేసిన చోట చీము పట్టిందని వైద్యులకు చెప్పిన పట్టించుకోవడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. అలాగే, రోగులకు పెట్టే భోజనం ముక్కిపోయిన ఆహారం ఇస్తున్నారని, ప్రశ్నిస్తే ఇష్టం ఉంటే తినండి.. లేదంటే వెళ్లండి అని అంటున్నారని పేషంట్లు కార్పొరేటర్‌కి తెలిపారు. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడగా పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఆరోగ్యశాఖ మంత్రి స్పందించి రోగులకు సరైన వైద్య సేవలు, నాణ్యమైన భోజనం అందించేలా చూడాలన్నారు. లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



వైద్య సేవలపై ఆరా తీస్తున్న కార్పొరేటర్

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట భద్రత

డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ డివిజన్‌లో 13 కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుందన్నారు. ఈ మేరకు స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ ఫోర్‌తో పాటు 60 మంది పోలీసు సిబ్బంది బందోబస్తుకు నియమించామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో సీఐ శివలింగం, రూరల్ సీఐ హన్మంత్, టౌన్ ఎస్ఐ కాశీనాథ్ పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంమోహన్‌రెడ్డి

నిందితులను కఠినంగా శిక్షించాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మండల పరిధిలోని ఫసల్‌వాది శివారు ప్రాంతంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు లలిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఇలాంటి ఘటన జరగడం ఆందోళకరమన్నారు. ఇంటి బయట ఆడుకుంటున్న 8 ఏళ్ల చిన్నారిని దుండగులు మద్యం మత్తులో లైంగిక దాడికి తెగపడ్డారని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరగడం ఇది రెండవసారి అని, జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆవరణలో భర్తకళ్ల ముందే మహిళపై అత్యాచార ఘటన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరుస ఘటన నేపథ్యంలో విద్యార్థినులు, మహిళలు భయాందోళన చెందుతున్నారని చెప్పారు. విద్యార్థినులకు, మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు సునీత, మమత, లక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లలిత

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

వట్‌పల్లి(అందోల్): మండలంలోని నాగులపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. జిల్లా కలెక్టర్‌గా నీల, డీఈఓగా ఇమ్రాన్, ఎంఈఓగా మమత, ప్రధానోపాధ్యాయుడిగా వైష్ణవి, ఉపాధ్యాయులుగా రఫి, పృథ్వీక్, విశ్వతేజ, విజయకృష్ణ, దివ్య వ్యవహరించారు. ప్రతిభను కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిద్దేశ్వర్, ఉపాధ్యాయులు వరలక్ష్మి, అఫ్షాన్ పాల్గొన్నారు.



కల్హేర్(నారాయణఖేడ్): బీబీపేట్‌లో..

బీబీపేట్ ప్రాథమిక పాఠశాలలో..

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని బీబీపేట్ మండల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓగా అలకనంద, హెచ్‌ఎంగా శ్రీలత, పలువురు విద్యార్థులు టీచర్లుగా వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్‌ఎం రాములు అభినందించారు. కార్యక్రమంలో టీచర్లు సమద్, వినయ్, సంధ్యారాణి, సుజాత, ఉర్మిళ పాల్గొన్నారు.